ఘనంగా శిఖర ప్రతిష్ఠ



రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ అధ్యక్షుడు బసవరాజ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగా శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సన్మానం



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 4వ వార్డు అధ్యక్షులు మద్ది నారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్ అవార్డుతో సత్కరించిన సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన నారాయణరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వీరబాబు, అంబారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విజయ్ కుమార్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి గ్లోబెల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



గోపికలు, చిన్ని కృష్ణులతో ప్రిన్సిపాల్ శ్రీదేవి

సుభాష్‌నగర్: గాజులరామారం శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌లో రెండు రోజుల ముందే బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాఠశాలలకు రావడంతో చూపరులను ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ పి. శ్రీదేవి మాట్లాడుతూ.. కష్టాష్టమి పండుగ ప్రాముఖ్యత విద్యార్థులకు తెలియజేసినట్లు తెలిపారు.

చర్యలు తీసుకోండి..



నిజాంపేట్: తప్పుడు పత్రాలతో డబుల్ బెడ్ రూమ్ పొందిన వారిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బాచుపల్లి నందు డబుల్ బెడ్‌రూమ్ ఓ వ్యక్తి తప్పుడు ఆధారాలతో కుల ధృవీకరణ సర్టిఫికెట్‌పై డబుల్ బెడ్ రూమ్‌ని పొందారని తెలిపారు. అంతేకాకుండా ఓ వర్గాన్ని కించపరిచే విధంగా మాట్లాడారని, దీనిపై విచారణ జరిపి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్‌కు సన్మానం



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

చింతల్: చింతల్ డివిజన్ పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో సర్వే నంబర్ 155లో ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ వేయడంతో బుధవారం బస్తీ మాజీ అధ్యక్షుడు అల్లాబకాష్ ఆధ్వర్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ వేయించిన కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. మిగతా 1500 గజాల స్థలాన్ని సైతం కబ్జా చెర నుంచి కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు.

ప్రమాదకరమని తెలిసినా..

కుత్బుల్లాపూర్: ప్రమాదకర ప్రయాణం ప్రాణాలు తీస్తున్న వాహనదారులు మాత్రం మారడం లేదు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని గాజులరామారం నుంచి షాపూర్‌నగర్‌కు వచ్చే దారిలో బాలయ్య హోటల్ మూలమలుపు వద్ద ముందు హెల్మెట్ లేకుండా ఓ ద్విచక్ర వాహనంపై నలుగురు వెళ్తున్నారు. వెనుక కూర్చున్న వ్యక్తి కింద పడుతుందా...! అన్నట్లుగా కూర్చొని ఉంది. ఇలా ప్రమాదకరంగా ప్రయాణం చేయడం పై పలువురు వాహనదారులు పెదవి విరిచారు.



అధికారుల అలర్ట్

- ఉదయం నుంచి మబ్బులతో కమ్మేసిన ఆకాశం
- వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా యంత్రాంగం
- రోడ్లపై వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపుపై కసరత్తు



చింతల్ పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఉప కమిషనర్ మల్లారెడ్డి, ఏఎంహెచ్ఓ మమత

కుత్బుల్లాపూర్: భారీ వర్షాల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు అలర్ట్ అయ్యారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాలతో బుధవారం ఉదయం నుంచే ఆయా విభాగాల అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహాలతో పాటు డీఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, వైద్య ఆరోగ్య అధికారి మమత ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్రధాన రోడ్డుపై నీరు నిలిచే ప్రాంతాల వద్ద సిబ్బందితో మరమ్మతులు చేయించారు. సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీ గణేష్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు వస్తే తీసుకోవల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అదేవిధంగా బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ గిరి ప్రసాద్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు మల్లంపేట్ ప్రాంతంలో ఉన్న చెరువును పరిశీలించారు. ఫుల్ ట్యాంక్ నిండిన తర్వాత రోడ్డుపై నీరు నిలవడంతో అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ తో పాటు నీరు నిల్వ ఉండకుండా అప్రమత్తం చేశారు. ఉదయం నుంచి భారీ వర్షం వస్తుందని భావించిన ప్పటికీ మోస్తారుగా ముసురు వచ్చి ఆకాశం మొత్తం మబ్బుగా ఉండడం జరిగింది. మొత్తం మీద అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఆయా విభాగాల అధికారులు అనేక ప్రాంతాల్లో అలర్ట్‌గా ఉండటం విశేషం.



కుత్బుల్లాపూర్‌లో నాలాను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ డీఈ పాపమ్మ, ఏఈ అనురాగ్



మల్లంపేట్ చెరువును పరిశీలిస్తున్న బాలానగర్ ఏసీపీ గిరిప్రసాద్, జీడిమెట్ల సీఐ శ్రీనివాస్

సహాయక చర్యలపై సమావేశం

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ ఆఫీసు కౌన్సిల్ హాల్‌లో బుధవారం భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్, ఎలక్ట్రికల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా చెరువులు, ఎఫ్‌టీఎల్ లెవెల్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని, చెరువు కట్టలు తెగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన, అదే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఈదురు గాలులతో కరెంటు తీగలు, స్తంభాలు తెగిపడితే సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లపై వరదనీరు చేరి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనాలను మళ్లింపు వంటి వాటిని ట్రాఫిక్ పోలీసు దగ్గరుండి పర్యవేక్షించాలని కమిషనర్ కోరారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో గండిమైసమ్మ తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ తదితరులు

దేశ భక్తిని పెంపొందించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: చిన్నారుల్లో దేశ భక్తిని పెంపొందించడంతో పాటు రాబోయే రోజుల్లో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశ అభివృద్ధిలో భాగస్వాములుగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలో బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై లిటిల్ లిల్లీ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థుల 300 మీటర్ల జాతీయ జెండా ర్యాలీని ప్రారంభించారు. దేశభక్తి గీతాలతో, జాతీయ నినాదాలతో హోరెత్తిన కొంపల్లి ప్రధాన రోడ్డులో దారి పొడవునా త్రివర్ణ పతాకం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మేడ్చల్ రూరల్ జిల్లా పూర్వ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరితరావు, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్ధన్ రెడ్డి, ఓబీసీ ఉపాధ్యక్షుడు బూర్గుబావి అశోక్, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, కోకన్వీనర్ శివాజీ రాజు, తిరంగ యాత్ర కన్వీనర్ శివానంద పాల్గొన్నారు.



300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత



నిజాంపేట్: ఓ మహిళ పోగొట్టుకున్న బంగారు చైన్‌ను బుధవారం బాచుపల్లి పోలీసులు తిరిగి అప్పగించారు. ప్రగతినగర్‌కు చెందిన ఇందిరా ప్రియదర్శిని చుందూరు (40) ఇటీవల తన 12 గ్రాముల బంగారు గొలుసును బజరంగ్ జ్యూవెలర్స్ షాప్ బయట పోగొట్టుకున్నారు. ఆమె వెంటనే బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన స్టేషన్ డీఐ ఎస్. సురేష్ క్రైమ్ బృందంను తక్షణమే రంగంలోకి దిగారు. సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫుటేజీ ఆధారంగా ఆచూకిని తెలుసుకుని గొలుసుని ప్రియదర్శినికి అందజేశారు.

జేఎన్‌టీయూలో తీజ్ పండుగ

బాలానగర్: బంజారా సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేసేలా 'తీజ్ పండుగ'ను నిర్వహించుకోవాలని పోలీస్ అధికారి భూక్యా రామిరెడ్డి అన్నారు. జేఎన్‌టీయూలో బుధవారం నిర్వహించిన తీజ్ పండుగ ప్రారంభ పూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సంప్రదాయాలను పాటిస్తూ అన్ని రంగాల్లో ప్రత్యేకతను సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాంజీ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.78.34 కోట్ల నిధులు కేటాయింపు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: దుండిగల్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.78.34 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక సంక్షేమ పథకాలు అందజేస్తూ, ప్రజా అవసరాలకు అనుగుణంగా దుండిగల్ మున్సిపాలిటీలోని ప్రతీ బస్తీకి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నిధులు కేటాయింపుపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొగునూరు శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, గాగిలాపూర్ మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, సాదు యాదవ్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొలన్ హన్మంత్‌రెడ్డి



నియోజక వర్గానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేత సాతాల గోపాల్ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తెలంగాణలో వైఎస్సార్ అభిమానులు ఎంతోమంది ఉన్నారని, ఇక్కడ కూడా పార్టీని నడిపించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు తెలిపారు. – కుత్బుల్లాపూర్

ఐటీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ పథకం కింద పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ కోర్సు అడ్మిషన్ల గడువును పొడిగించినట్లు 'మనూ' స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ బుధవారం తెలిపారు. 'మనూ'లోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ కోర్సు నిర్వహించబడుతోందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 21వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆయన వివరించారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ సాబేర్ అలీ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ ప్రజలకు సూచించారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో వర్షాకాల అత్యవసర బృంద సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల మధ్య సమన్వయం కల్పించుకుని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో సహాయపడేందుకు అన్ని విభాగాలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు అత్యవసర సమయంలో మున్సిపల్ కాల్ సెంటర్ నంబరు – 040-29569700, 18005997873 ద్వారా సహాయం పొందవచ్చని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ బాచుపల్లి, ట్రాఫిక్ సీఐ, హైడ్రా అధికారులు, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు

నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ఆలయ పంతులు రాకేష్, సంకటహర చతుర్థి సందర్భంగా పంచామృతా అభిషేకాలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద దాతలు ఓర్సు లింగస్వామి, వి.ఆనంద్, దండుగుల స్వామి, కె.సంతోష్, రవి కిరణ్, శివశక్తి ఎలక్ట్రికల్ హార్డ్‌వేర్, సురేష్, దామోదర జగదీశ్వర్ గుప్తాలు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గోవిందరావు, దేవేందర్ గుప్తా, సత్యనారాయణ, ముక్కర్ల లాలయ్య, కృష్ణ రావు, వెంకట్‌రావు, మల్లికార్జున్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



డ్రగ్స్‌రహిత సమాజం కోసం కృషి చేయాలి



యాంటీ డ్రగ్స్ ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి



నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి కృషి చేయాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మెప్మా సభ్యులతో కలిసి మాదక ద్రవ్యాల నిరోధక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ తమతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేయాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు అవుతామని మెప్మా సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, ఆర్ఐ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపేట్ మున్సిపల్‌లో..

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ట్రాఫిక్ సీఐ, హైడ్రా అధికారులు, మున్సిపల్ అధికారులు మాదక ద్రవ్యాల వినియోగాన్ని తిరస్కరించాలని ప్రతిజ్ఞ చేశారు.

నార్త్‌సిటీ స్కూల్‌లో రెయిన్ డే

సుభాష్‌నగర్: సూరారంలోని నార్త్ సిటీ స్కూల్ లో బుధవారం నర్సరీ చిన్నారులచే రెయిన్ డే నిర్వహించారు. నర్సరీ, యుకేజీ విద్యార్థులకు గొడుగులు ఇచ్చి వర్షంలో వివిధ ఆకారాలలో నిలుచో పెట్టారు. వర్షం ఎలా కురుస్తుంది. వర్షం వల్ల ప్రయోజనం ఏమిటి, వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురవాలంటే మనం ఏమి చేయాలి అన్న విషయాలపై చిన్నారులకు క్లుప్తంగా వివరించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ తెలిపారు.



ప్యూరిఫై మాటున గరళం !

- నిబంధనలు పాటించకుండానే నీటి వ్యాపారం
- ఐఎస్ఐ మార్కు, లైసెన్సు లేకుండానే వాటర్ ప్లాంట్లు
- పట్టించుకోని అధికారులు రోగాల బారిన ప్రజలు



ప్యూరిఫై (శుద్ధి) చేయకుండానే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగరాలు, పట్టణాల్లోని పలు కాలనీలు, బస్తీల్లో విచ్చలవిడిగా నీటి ప్లాంట్లు ఏర్పాటైనా.. ఒక్క చోట కూడా కనీస నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, పోచారం, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో 1200కు పైగా ప్యూరిఫై (శుద్ధి) ప్లాంట్లు ఉండగా.. ఇందులో అన్ని అనుమతులతో కొనసాగుతున్న ప్లాంట్లు దాదాపు 200 వరకు ఉన్నట్లు భూగర్భ జలవనరులశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నీటిని నిబంధనలకు అనుగుణంగా

> గ్రేటర్‌తో సహా శివారు పురపాలక సంఘాల్లోని ప్రజలు ప్యూరిఫై వాటర్‌ను మాత్రమే తాగునీటిగా వినియోగిస్తుండటంతో ఇదే అదునుగా భావిస్తున్న కొందరు వ్యాపారులు ప్యూరిఫై వాటర్ పేరుతో నీటి వ్యాపారం చేస్తున్నారు.

పెరిగిన నీటివ్యాపారం..

గతంలో వేళ్ల మీద లెక్క పెట్టే సంఖ్యలో ఉండే ప్యూరిఫై ప్లాంట్లు.. నేడు పురపాలక సంఘాలలోని కాలనీలు, బస్తీలతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో ప్రతిచోటా ప్యూరిఫై ప్లాంట్లు వెలిశాయి. పెళ్లిళ్లు ఇతర శుభ కార్యాలయాలు, ఫంక్షన్స్, హోటళ్లు, బార్లు, వైన్‌షాపులు, ఇతర వ్యాపార సముదాయాలను కలుపుకుంటే వేలసంఖ్యలో క్యాన్ల విక్రయాలు జరుగుతున్నాయి. ప్లాంటు దగ్గరికే వెళ్లి తీసుకుంటే ఒక్కో క్యాన్‌కు రూ.10 తీసుకుంటున్నారు.

నిబంధనలు ఇవి..

- వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు బీఎస్ఐ అనుమతి ఉండాలి. ప్రతి ఏటా రెన్యువల్ చేసుకోవాలి. ప్లాంటులో విశాలమైన హాల్ ఉండాలి. వెలుతురు, గాలి ఉండాలి.
- టైల్స్, గ్రానైట్ గచ్చు ఉండాలి. స్టీల్, హెచ్‌డీపీ పైపులైన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన ఫిల్టర్ యంత్రాలనే వాడాలి.
- నీటిట్యాంకులు, ఇతర సామగ్రి, నాణ్యమైనవి బిగించుకోవాలి. పురపాలక సంఘం లేదా మున్సిపల్ సర్కిళ్ల కార్యాలయం నుంచి ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

నియంత్రణ లేక..

మిషన్ భగీరథ పథకం రానప్పుడు ఎక్కడైతే తాగడానికి పనికిరాని నీరుందని సమాచారం వస్తే అక్కడ నీటిపరీక్ష జరిపి ఆర్వో ప్లాంట్లకు అనుమతి ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితితో పాటు నియంత్రణ లేకపోవడంతో ఇదే అదునుగా భావిస్తున్న నీటి వ్యాపారులు ఇష్టమొచ్చిన రీతిలో ప్లాంట్లను విస్తరిస్తున్నారు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే నగర, పట్టణ ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా బయటపడే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.